


బలివాడ కాంతారావు

క్రొత్తగా నేను బొంబాయిలో వెయ్యి మందికి పైగా కార్మికులు పనిచేసే కార్ఖానికి పెర్సనల్ ఆఫీసరుగా బదిలీ మీద వెళ్ళినప్పుడు ఒక వ్యక్తిగురించి తొలిరోజుల్లోనే చాలా విన్నాను. నా దిగువనున్న ఆఫీసు సూపరింటెండెంట్ మొదలు బంట్రోతువరకు చెప్పిన మాటల వల్ల నాథూరామ్ వినాయక్ పాటిల్ పరమ మూర్ఖుడిలా నా మనసులో ప్రతిష్ఠింప బడ్డాడు.

వాడిని అచ్చువేసిన అంబోతులా విడిచిపెట్టేశారట. వాడిరాక తెలుసుకొని గేటుదగ్గర గూర్ఖాకూడా పక్కకు జరిగి పోతాడట. నా ముందుఆఫీసరు చార్జిషీటు యిస్తే అతని యెదరగానే చింపివేసి "నీ ఒక్కగాని ఒక్క కొడుకు నీకు దక్కాలనిలేదా?' అని ప్రశ్నించాడట ఆఫీసరు కొడుకుమీద ప్రేమతో మరేం చెయ్యలేక పోయాడట. యిలా యెన్నెన్నో సంఘటనలు చెప్పుకొచ్చారు చివరకు అందరూ నాకు ఒకే సలహా యిచ్చారు—ఆ నిప్పును ముట్టుకోకండి; చెయ్యి కాలి పోతుందని! ఇలాంటి వ్యక్తులగురించి వినటం వాళ్ళని మార్చటానికి ప్రయత్నించటం నా ప్రహానోళ్ళ సర్వీసులో కొత్తకాదు అధికారి ఆర్చేవాడయ్యేకన్నా తీర్చేవాడైతే నెగుకొస్తానన్న నమ్మకం నాకుంది.

అవసరం పడ్తేగానీ పాటిల్‌ని పిలిపించటం పెట్టుకోలేదు ఆ వారం రోజుల్లోనే ఒకరోజు నాయెదరగా అతన్ని పెట్టమన్నాను. కబురందగానే వెటకారంగా నవ్వాడు. ధీమాగా చాలాసేపయ్యాక వచ్చాడు. ఎకాయెకి లోనికి చొచ్చుకుంటూ "రామ్ రామ్ సాయబా'' అంటూ నిల్చున్నాడు ఆరడుగుల మనిషి. మూతి నిండుగా నున్న నల్లని బొద్దు మీసాలు మాటలకు హుందా నిస్తాయ్. పుష్టిగా పెరిగిన మొక్కకు ఉప్పునీరు తగిలినట్టు అతని బలిష్ఠమైన శరీరానికి తాగుడుసోకి కొంత వంచేసింది. ఏదు పంది విదల్చిన వెంట్రుకల్లాంటి జుత్తులోంచి నూని కారుతోంది. నోరు తంబాకుతో పొంగి తిరగలిలా కదులోంది. బాతలాంటి ముక్కుకు రెండువేపులా చురచురా చూస్తూ త్రిప్పుతున్న కళ్లు, సాయంత్రపు ఎండను కప్పబోతున్న నల్లటి మేఘంలాంటి కళేబరంవేపు కళ్ళప్పగించి చూస్తున్నాను

"ఏం? నా ముఖంలో సినీమా చూస్తున్నావా సాయబా?" ఈ ప్రశ్న నాలో చైతన్యాన్ని తెప్పించి చిన్న నవ్వుతో "నువు చాలా అందమైనవాడివి" అన్నాను. వాడు బిగ్గరగా నవ్వుతూ "యింతమంది ఆఫీసర్లు వచ్చారు. నువ్వొక్కడివే నిజం పలికా,"వన్నాడు.

"నీలాంటి వెడల్పాటి వక్షం, తీక్షణమైన కళ్ళూ యిదివరకు నేనెక్కడా చూడలేదు నేనే జడదాన్నయ్యేంటే.."

"అరే దొండిబా" — అంటూ

ఫ్యాన్ వైపు తిరిగి "ఇంత సరదాగా మాటాడే సాయబానియెక్కడా చూడలేదు"

"పాటిల్ - నేను యీ వూరొచ్చి పదిహేను రోజులైంది నిన్ను చూడటం యిదే తొలిసారి నివ్వెంతో చెడ్డవాడివని విన్నాను. నిన్ను కల్సుకన్నాక నీఅంత మంచివాడు లేడేమో అనిపిస్తోంది"

ఒకసారి మీసాలు దిడుముకున్నాడు. నేను వాడి కళ్ళవేపు నిదానంగా చూస్తూ "యింతకీ నీకెందుకు పిలిపించానంటే-"

"చార్జిషీటు యివ్వటానికా?"

"కాదు. ముందు ప్రేమ అన్న మందుతో రోగిని కుదర్చటానికి ప్రయత్నిస్తాను. మందుకు కుదరని జబ్బుకు ఆపరేషనే గతి. నీలాంటివాడికి మందిచ్చినా ఆపరేషను చేసినా బాగు చెయ్యాలనేకదా?"

"నాకు జబ్బున్నవాళ్ళకే జబ్బు సాయబా."

"నీ రికార్డు చూశాను. నెలకు వారం రోజులైనా పనిలోకి రావు. ఆ వారం రోజులైనా వచ్చి మళ్ళీ వెళ్ళిపోతుంటావట. మనిషికి ఒక న్యాయం కాదు. అందరికీ ఒకటే వుండాలి."

"పాటిల్ ఈ లోకంలో ఏం జరుగుతుందో చూడకండా కళ్ళు మూసి మాటాడుతున్నావా అని అన్నట్టుగా వెటకారంగా "అలాగా" అంటూ దీర్ఘం తీశాడు.

"ఇంత తక్కువ జీతంతో యెలా బతుకుతున్నావ్?"

"ఆ వచ్చేది నాకు చాలు"

"భార్యా పిల్లలగతి చూడు.

"నాకు పెళ్ళాం ఒకర్తే వుంటే దానికేమీ లోటులేదు"

"నేను సేవ చెయ్యటానికి వచ్చాను, గానీ నవారీ చెయ్యటానికి రాలేదు. మీ అందరిబాగు నా బాగు"

"అలాగా - ఏదీ సాయబా - ఒక్క అయిదు రూపాయలు పడేయ్"

"తీసి అయిదురూపాయలు ఇచ్చాను."

"అరే దొంగడిబా! యీ సాయబా ఎంత అంటాడో అంతే చేస్తాడు." అని నా వేపు తిరిగి సలాం చేస్తూ తుర్రుమని పారిపోయాడు.

సాయంత్రం గేటుబైటకు వెళ్ళేసరికి బస్సుస్టాప్ దగ్గర తాగిపడివున్న పాటిల్‌ని చూశాను. నన్ను చూడగానే తూలుతూ లేచి యింతవరకు వచ్చిన ఆఫీసర్లను తిట్టూ అందరియెదుట నన్ను చేస్తూ నన్ను పొగిడి చెప్తున్నాడు. నేనిచ్చిన అయిదురూపాయలు ఇలా వినియోగపడినందుకు బాధ. నేనంటే వాడిలో సదభిప్రాయం కలిగినందుకు సంతోషంతో అలా క్యూలో నిల్చున్నాను. నాతోపాటు బస్సెక్కాడు. కండక్టరుకు టికెట్టుకోసం నా వేపు చూపించాడు. బస్సు కదులుతుంటే మరాఠీలో కమ్మని రాగాలు తీస్తున్నాడు. అప్పుడప్పుడూ లయ తప్పుతున్నా, విన ఇంపుగా వున్నాయ్




ఆ మరుసటిరోజు నేను ఆఫీసుకి వెళ్లేసరికి వరండాలో నిల్చున్నాడు. నన్ను చూడగానే "రాంరాం సాయబా," అన్నాడు. నేను వినిపించుకోనట్లే కోపంగా లోనికి వెళ్ళిపోతుంటే నా వెంట పడ్డాడు. వాడు మాటాడటానికి అవకాశం ఇవ్వకుండా చప్పున పర్సు నుంచి పదిరూపాయల కాగితం తీసి అందించాను పుచ్చుకోకుండా "దేనికి సాయబా?" అన్నాడు.

"నిన్న యేంచేసావో దానికే."

"నా పెళ్ళాం యీయనినాడు నీ దగ్గరకే వస్తాను."

డబ్బు పుచ్చుకోకుండా, అసలు ఎందుకు వచ్చాడో చెప్పుకోకుండా వెళ్ళిపోయాడు వారంరోజులవరకు పాటిల్ నా కంట పడలేదు. కానీ ప్రతిరోజూ ఏదో ఒక సమయాన ఇంట్లో వాడి విషయమై ఆలోచిస్తున్నాను. వాడి భార్య సంగతి. ఎన్నెన్నో కథ లల్లుకున్నాను. కాస్త కలిగిన ఇంటిబిడ్డేమో? లేక ఎక్కడైనా పని చేస్తుందేమో? ఏదయినా వ్యాపారం చెయ్యకూడదూ? బహుశః దొంగసారా బొంబాయి శివార్ల నించి సిటీమధ్యకు చేర్చే ఆడవాళ్ళ ముఠాలో చేరిందేమో? ఏదో ఒక రాబడి లేకపోతే భర్తకు తాగడానికెలా యివ్వగలుగుతుంది? ఏదో స్వలాభం లేకుండా అతనికి అంత ఎలా ఇస్తుంది? పిల్లాజెల్లా లేని ఆమె రూపు, యౌవ్వనపు బిగువు, సహజంగా మరాఠి ఆడవాళ్ళల్లో వుండే అవయవాల సొంపు, పెంపు – రకరకాల రూపాలతో ఒకే మనిషిని వివిధ కోణాలనించి చిత్రించుకుంటున్నాను.

ఊహలో చిత్రించుకున్న చిత్రాలు

నిజంకుంచెతో చెరపటం నా కిష్టంలేదు. అందుకోసమే, నేనామెగురించి అడిగి తెలుసుకోలేదు. ఆ మరసటివారం టైం కీపరుని పిల్చాను మధ్యను ఆదివారం తప్పించి వరుసగా పదిరోజులు ఉద్యోగానికి పాటిల్ వచ్చినట్లు మస్తరునుంచి తెలుసుకొని ఆశ్చర్యపోతుంటే టైమ్ కీపరు కార్నిక్ అన్నాడు "మీరంటే గౌరవిస్తున్నాడు. ఆ సాయిబా చెప్పిన మాటల్లో ఒకటైనా వినకపోతే నాకు న్యాయం కా"దని అన్నాడు.

"అందుకేనా నాగాలేకుండా వచ్చాడు."

"వాడు పనిలోనికి రాకపోయినా ఫరవాలేదు."

"ఏం ?"

"వాడి భార్య గడిస్తోందిగా."

"ఎలా ?" చప్పున అనుకోకుండా అడిగాను.

"వాడి యింటిదగ్గరే నా యిల్లు. ఆమె రెండో భార్య, ఎర్రగా బుర్రగా బింకంగా వుంటుంది. వీడామెకు తిండే సరిగ్గా పెట్టేవాడుకాదు. ఆకలంటే తాగించేవాడు. ఎక్కడైనా పని చేస్తానంటే ఒప్పుకునేవాడుకాదు. ముందుకు వెళ్తే నుయ్యి వెనకకు వస్తే గొయ్యి. కన్నారింటికిపోతే ఖూనీ చేస్తాడని భయం. వీడి కబంధ హస్తాలనించి పోట్లాడి తప్పించుకోలేదు. దానికీ కడుపుంది అది నింపాలా ? అందం, ఒళ్ళు బిగువూ వుంది. అది మగాడు అనుభవించాలనే కోరిక వుంటుందా ? ఆమె ఎలాగో ఒకలా బ్రతకాలి. అందుకోసం అమ్ముకుంటోంది."

"దేనిని ?"

"ఒళ్ళంతా."

"హాఁ" ఏదో ఘోరం జరిగిపోయినట్లు దీర్ఘం తీశాను.

"వీడి దృష్టిలోనికి అసలుసంగతి రాకుండా వుండటానికి వీడికి లంచం యిస్తోంది. వీడు అసలే పశువు. యిప్పుడు తప్పతాగిన దున్నపోతయిపోయాడు."

నా మదిలోని చిత్రం చిందరవందరైపోయింది. దానిని మళ్ళీ ఒక రూపులోనికి తేవాలంటే యెంతో శ్రమపడాలి. నా శ్రమ పాటిల్ని బాగుపరిస్తే ఫలిస్తుంది. వీడు స్వతహాగా మంచివాడని తోచింది. ఏదో చెడు సహవాసమో, భరించలేని బాధో తననిలా ముళ్ళబాటలోనికి నడిపించి వుంటుంది. వీడు యెలాగూ వుద్యోగంపై శ్రద్ధ చూపిస్తున్నాడు వున్నా మిగతా దురభ్యాసాల్లో ముఖ్యమైన తాగుడునుంచి వీడు బైట పడేటట్లు చూడాలి. వీడికి సరియైన మనిషిని చేస్తే ఆమెను ఆదరిస్తాడు. ఆ ఆదరణతో ఆమె మళ్ళీ గృహిణిగా మసలుతుంది. నా శక్తిని పరీక్షించే వాడుగా పాటిల్ నాలో యెల్లవేళలందు వుండసాగాడు వాడివి, నా స్వంత అవయవాల్లో యే వొక్కదానికి దెబ్బ తగి




లితే నే నెంత జాగ్రత్త తీసుకుంటానో, వాడి విషయంలో అంత జాగ్రత్త తీసుకోడానికి ప్రయత్నిస్తున్నాను.

నెలలో మూడో వారంలో మళ్ళి డ్యూటీకి సరిగ్గా రాలేదు. వాడ్ని పిలిపిద్దామనుకుంటుంటే వాడే యెదురయ్యాడు. మళ్ళి యేమైంది. డ్యూటీకి సరిగ్గా రావటంలేదేం?"

''సాయబా! పేకాట్లో మూడురోజుల్లో వచ్చింది పిన్నంతా పోయింది. చేతొక్క కానీ లేదు. డబ్బు అప్పుకావాలి?"

"ఎంత?"

"పది చాలు.''

కొద్దిగా సంశయిస్తూనే యిచ్చాను.

ఆవేళ సాయంత్రం బస్సు స్టాపు దగ్గర కాలవలో తప్పతాగి తెలివి లేకండా పడివున్నాడు. బట్టలంతా మురికితో నిండిపోయి వున్నాయి దగ్గరకు వెళ్ళి రెండు చరిచాను. నిషాఘీదే ''యెవడ్రా" అని గొణిగాడు.

"సాయబు' అన్నాను.

"సాయబా" అంటూ ఒకసారి తేరి చూశాడు. సాష్టాంగ పడిపోయి అదే పనిగా యేడవటం మొదలుపెట్టాడు. అలా యేడుస్తూనే "సాయబా; మరి తాగనంటే తాగను. తాగితే నన్ను డిస్మిస్ చేసియి," అన్నాడు.

ఆ మరుచటి ఆదివారం వుదయం

వరండాలో ఓ పుస్తకం పట్టుకొని ఒక్కడినే వాలుకుర్చీమీద కూర్చున్నాను. నా దృష్టి పుస్తకంమీద లేదు. యెదురుగా వున్న గార్డెన్ ఫెన్సింగ్‌మీద ఒక ఆకుపచ్చని పిట్ట తోక ఆడిస్తూ అరుస్తోంది. ఆ దగ్గరకే ఒక కారునల్లని పిట్ట చేరగానే పచ్చపిట్ట దూరంగా కదలిపోతోంది. నా మంచి ఆలోచనలు పాటిల్‌ను చూడగానే యెగిరిపోయినయ్. వాడు నా యింటికి రావటం నాకు నచ్చలేదు. వీడు మైకములో వున్నప్పుడు నేను యింట్లో లేని సమయంలో వున్నాననుకొని నా యింటివేపు నడిచే కార్మికుల్ని నెంతరినో యిదివరకు చూశాను. మళ్ళీ డబ్బుకోసమే వచ్చియుంటాడు. డబ్బు యిచ్చి మరింత పాడుచేసినవాణ్ణవుతాను. ఇవ్వకూడదనే నిర్ధారణ, వీడికి నీతులు గరపాలనే కోరిక ఒక్కసారే కలగాయ్

"రామ్‌రామ్ సాయబా." అంటూ స్తంభానికి చేరబడి వరండామీద నా యెదురుగా కూర్చున్నాడు. వాడి ముఖ భంగిమలబట్టి అప్పుడే కొద్దిగా తాగినట్లుంది వాసనకూడా వేస్తోంది. వాడు మాటాడే అవకాశం యివ్వకుండానే హిందీలో మొదలుపెట్టాను — "చూడు పాటిల్! నీ సంగతి నాకేం నచ్చలేదు. మా తెలుగులో ఒక సామెతుంది. "కాకై కలకాలం బతికే బదులు, హంసై ఆరు నెలలు బతకడం మంచిదంటారు. నీకేం తక్కువచెప్పు? అందమైన పెళ్ళాం, మంచి ఉద్యోగం; పుష్టైన ఒళ్ళు యివన్నీ నీ చెడుగుణాలతో పాడుచేసుకుంటున్నావ్. ఈ లోకంలో న్యాయంగా నీతిగా పోయే వాడికున్న గౌరవం, తృప్తి ఇంకెవరికుండదు. నీతిగా బతుకు—లోకం నిన్ను హర్షిస్తుంది."

పాటిల్ అంతవరకు మౌనంగా విని దీర్ఘంగా "నీతి" అని నవ్వి. "ఎక్కడుంది సాయబా?"

"నీతి వుండబట్టే లోకంలో మంచి జరుగుతోంది."

"నీతి నీతని అంత చెప్తున్నారు. నాతో. ఈ మహాపట్నంలోనికి రండి చూపిస్తాను. ఎనిమిది అంతస్తుల మేడమీద బతికిన మారాజులు, పక్కనేవున్న గుడిసెల్లో వస్తున్నా శేపే చూడరు. ఏ షాపులో కెళ్ళేడి దగాయే. ఆ చర్చిగేటు — చేషనుదగ్గర నూరురూపాయల కాగితం పట్టుకొని నిల్చోండి. ఒళ్ళంతా చూపించి మరీ నక్కనిసుక్క నిన్ను లాక్కనిపోతుంది. నీతిని కాపాడుతామన్న పోలీసోళ్ళు, గౌర్నమెంటోళ్ళు, కచేరీలు — ఇటిలో ఎక్కడ నీతుంది చెప్పండి. లోకాన ఇంతమంది మలమల మాడిపోతుంటే యీ పేషన్లేంటి. యీ విందుభోజనాలేంటి — యీ యేపారం అంతా ఏంటి? చెట్టుందంటే ఆ కాలానికి పళ్ళు రాలుస్తాది. కోడుందంటే ఆ టైముకి గుడ్డుపెట్టాది కుక్కుందంటే దాని విశ్వాసం దానికుంది. పశువున్న



దండే. దానిపని అతి సేస్తాది. మరి మనిషో? ఈ కడుపేంగ ఎన్ని [illegible] గుతున్నాయి సాయబా? అది నింపుకోడానికి ఒక పద్దెడు పచ్చగడ్డి సాలదా? ఈ లోకాన్న నీతిలేని జంతువు మనిషే. ప్రజల్లో నీతెక్కడ వున్నది? నీతి పుస్తకాల్లోనే రాసుంది సాయిబా!''

ఇంత దీర్ఘమైన వుపన్యాసం విన్నాక 'ఎంచబోతే మంచ మంతా కంతలే అన్న సామెత వుంది' అన్నాను. మరుక్షణములో "ఒకరు నీతిగా వుంటేనే ఎదుటివాళ్ళ అవినీతిని ఎంచడానికి హక్కు కలుగుతుం''దన్నాను.

పాటిల్ అర్థం చేసుకున్నట్లుంది, నవ్వి "నాకు తాగుడు మానమంటావ్. అంతేనా?"

"అవును."

"తాగటంవల్ల నా బాధలు మర్చి పోతాను. నే నొక పశువునై పోతాను. సంతోషంతో తుళ్ళిపోతాను. నాకున్న ఒక్క సుఖాన్ని సంపకండి సాయబా!" దీనంగా అన్నాడు.

"తాగి పశువునై పోతానంటావు; పశువుకు సుఖం తెలీదు. సుఖదుఃఖాలు తెలుసుకున్న జంతువు మవి షొక్కడే. నీ మెదడు ఇన్నాళ్ళు పడుకుంది. ఇప్పుడు మేల్కొలుపు. పశుత్వం వదిలి మానవత్వాన్ని పొందు. సుఖదుఃఖాలు అనుభవించి సంసారంలో తరించు. పశువునించి మనిషివి కాడానికి యీ తాగుడు మాను."

శూన్య దృష్టులతో నావేపు చూశాడు. కానీ తాగుడు మానుతానని హామీ యివ్వ లేదు. లేచిపోతూ పదిరూపాయల కాగితం అందిచ్చాడు. ఓ క్షణం నన్ను నేను మరచిపోయాను. తరవాత "ఉంచుకో..." అన్నాను.

"ఒద్దు సాయబా .. అప్పు తీర్చక పోతే నీ కడుపులో పుట్టాలను. నాలాంటి స్నేహితుడితో యిప్పటికె ఏగలేకపోతు న్నావ్." అంటూ మీద వేసి వెళ్ళి పోయాడు.

ఆ నోటు ఒక యౌవ్వని ఒళ్ళు అమ్ముకోగా వచ్చినదన్న తలపు నాలో రాగానే ఖర్చు పెట్టకండా ఒక డగ్గర దాచాను.

తరవాత రెండు నెలలలోనూ పనిలో హాజరు తృప్తిగానే వుంది. మూడుసార్లు ఓవర్‌టైమ్‌కూడా చేశాడు. ఒకసారి పనిలోకి త్రాగివచ్చాడని రిపోర్టు రాగానే "యీసారి యిలా చేస్తే రూలుప్రకారం పోలీసులకు అప్పచెప్పవలసి వస్తుంది." అన్నాను.

"నీకు యిష్టం వచ్చినట్టు చెయ్యి సాయబా!" అన్నాడు.

తరవాత మూడు నాలుగుసార్లు గేటు బయట తాగి పడివుండటం చూశాను. తాగుడు యెలా మాన్పించటమో నాకు తోచలేదు. ఎన్ని చెప్పినా నవ్వేసేవాడు.

ఒకనాడు ఆఫీసులో వుంటుండగా చెంబూరు పోలీసు స్టేషనునుంచి ఫోను కాల్ వచ్చింది. ఇన్‌స్పెక్టర్ జాదవ్ మీద కనికరం చూపించి అతని కోర్కెను నాకు తెలియపర్చాడు.

"తాగినందుకేనా లాకప్ చేశారు?"

"కాదు"


"మరి దేనికి?"

"ఇద్దరిని మూర్ఛపోయినట్లు బాదే శాడు"

"ఎందుకూ?"

"ఏమీ చెప్పడు. ఈ లోకంలో దగ్గరవాళ్ళు మీరు తప్ప యింకెవరూ లేరట. బెయిల్‌కోసం మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నాడు."

"హాఁ" అని జవాబు చెప్పి ఫోను పడేశానేగానీ చాల యిరకాటంలో పడి



పోయాను. అతని వెంట తిరిగి వాడి వుదారత్వంవలన వుపకారం పొందిన వాళ్ళంతా యేమయ్యాడు? అధికారి నైన నేను వాడిని నా బాధ్యతమీద బెయిల్ మీద విడుదల చేస్తే, వాడు యెక్కడికో పరారైతే? విడుదల అయ్యాక బోను నించి విడిచిపెట్టిన సింహంలా వురికి యింకెవరి రక్తమో తాగితే? నేను యీ బాధ్యత తీసుకుని పెద్ద 'రిస్క్' తీసుకుంటున్నాను ఎవరి మాటా వినని మూర్ఖుడు యెందరినో యెదిరించి 'బల వంతుడ నాకే'మన్న పాటిల్, నా యెదరగా 'మేక యెదర తలవంచిన సింహములా' మెసలుతుంటే పోలీసుస్టేషనుకు వెళ్ళకండా వుండలేక పోయాను. ఈ అవకాశాన్ని యింకోలా వినియోగించుకోవాలన్న నా తహతహకూడా నన్ను యీ బాధ్యతను తీసుకోనిచ్చింది.

పాటిల్‌ని కల్సుకొని "ఎందుకు వాళ్ళని చావబాదావ్?" అన్నాను.

"ఆ యిద్దరి యెదవలు నా పెళ్ళం మీద నిగా వుంచారు. దానిసంగతి మీతో సెప్పలేదు సాయబా! అగ్గిలాంటిదాయి. నా సుకంకోసం కన్నోళ్ళింటినించి తెచ్చుకున్నదంతా తగడానికి పెట్టేది. దాని పనిపాట్లు అవి సేసుకుంటుంటే సిజిల్ కొట్టి యికారం సూపిస్తే, యింట్లోవుండి వూరుకుంటానా? వాళ్ళ దిమ్మా లూడదీశాను. దెబ్బతో మూర్ఛపోయినారు.

మరెన్నడూ సంసార్ల యింటిమీద పడరు.''

"కొట్టేటప్పుడు తాగిలేవన్నమాటః"

"కాగా మెకుక ల్లోనికి గొర్కి పోయిన అలవాట్లు ఒక్కసారి పోతాదా సాయబా? విష్వైనా నా మంచికోసమే సెప్తున్నావ్‌కదా: నేను పాడైనా బాగైనా నీకేం వస్తాది? నా తల్లివా తండ్రివా? నా దగ్గిరవాడివా? అయినా భరిస్తున్నావ్. అందుకే ఆపదలో నీ వ్వొక్కడవే అయినవాడి వయ్యావ్."

"నే నొకబాధ్యతగలపనిలో వున్నాను. బెయిల్ వుండాఅంటే యెంత బాధ్యత తీసుకోవాలో ఆలోచించావా?"

"ఎవరినైతే నమ్మానో వాళ్ళంతా కష్టానికి ఆదుకోలేదు. నీవు తప్పించి నా బాగు కోరేవా రింకేవరూ లేరు."

"అయితే నే చెప్పినట్లు వింటావా?"

'చెప్పండి' అన్నట్లు నా వేపు తేరి జూచాడు.

"నివు యీ వేళనుంచి తాగుడు మానేస్తానని హామీ యియ్యి." అని చె య్యి చాచాను. నా కుడిచేతిని వాడి రెండు చేతులతో అదే పనిగా మెల్లగా నొక్కుతూ, కళ్ళల్లో కారే నీటని ఆపుకోకుండానే నా చేతిలో చేయి వేసి "మరి తాగను" అన్నాడు.

నా కళ్ళల్లోనూ నీరు పేరుకున్నాయ్ ఈ సింహానికి కోరలు తీసివేయగలిగాననే గర్వ మేదో నాలో చొచ్చుకుంది. బెయిల్ మీద విడిపించాను. నాకు యింకో బాధ్యత కూడా వచ్చిపడింది అతని భార్య పడుపువృత్తిలో వుందని అతనికి అనుమానం కలగకుండా చూడాలి దానికి యీ కేసు కోర్టువరకూ వెళ్ళకండా చూడాలి. లేదా కోర్టులో యీ ప్రస్తావన రాకండా చూడాలి. అందుకే పాటిల్‌తో అన్నాను.

"నీ భార్య విషయం యెత్తావంటే అనవసరంగా ఆమెను కోర్టులోనికి లాగుతారు. అంచేత వాళ్ళు, చీకటివల్ల దొంగల్లా కనిపించారను. అనుమానంమీద ప్రశ్న వేస్తే జవాబు రాక పోగానే, వాళ్ళను పట్టుకోడానికి వెళ్తే వాళ్ళు కొట్టారు - అందుకే తనూ చెయ్యి చేసుకున్నట్లు చెప్పు." అన్నాను.

ఈ గొడవజరిగి రెండు నెలలు నడిచాయ్. నేనే పీడి విషయంలో లాయరును పెట్టాను. అయినా అతని భార్య ప్రస్తావన వచ్చింది. కోర్టుకు సాక్షిగా వెళ్ళవలసివచ్చింది అదృష్ట శాత్తు భార్యమీద అనుమానపడే సంఘటన యేదీ జరగలేదు ఈ రెండు నెలల్లోనూ పాటిల్‌తో సన్నిహితంగా మెసలడం జరిగింది. అతనిభార్య నా దగ్గర సిగ్గుపడేది. ఎదరగా మాటాడేది కాదు. ఆమెను చూస్తుంటే నాకు కోపం బదులు జాలివేసేది. ఒక మాణిక్యాన్ని బొగ్గుల్లోకి విసరినట్లు, వెన్నలాంటి హృదయంలో

క్రూరత్వం అనే విషం కలిపినట్లు. పవిత్రమైన గట్టిబంధం జారుముడిగా మార్చినట్లు - యిలా ఎన్నెన్నో ఆలోచనలు నాలో కలగేవి ఆ రోజుల్లో.

పందిని నంది చేసే చాకచక్యంగల ప్లీడరువలన పాటిల్ అంటే భయపడి అతనిమీదగాని, అతని భార్యమీదగాని సరియైనసాక్ష్యం చెప్పకపోవటంవల్ల - పాటిల్ శిక్షలేకుండా తప్పించుకపోయాడు. ఆశ వదలుకున్న నేను యీ వార్త విని ఆనందించాను. పాటిల్ యిప్పుడు చాలవరకు మారిపోయాడు. కొత్తజీవితంలో కాలుపెట్టాడు. క్రితం సంవత్సరంపాటిల్‌కి యీనాటిపాటిల్‌కి ఆకారంలో తప్పించి యింకేం కోరిక లేదు. పీడు పనిలోనికి నాగా లేకుండా వస్తున్నాడు తాగటంలేదు అచ్చువేసిన ఆంబోతుకాదు. రౌడీమూకలకు అంత దూరంలో వస్తున్నాడు. శాసనాన్ని మన్నిస్తున్నాడు. సుఖదుఃఖాలను అర్థం చేసుకొని అనుభవించే సంసారి, నీతిని పాలించే మనిషి.

ఒక దుర్మార్గుడ్ని సన్మార్గునిగా చేశానన్నతృప్తి నాలో నెలరోజులవరకు చావలేదు. ఎవరూ సాధించని ఘనకార్యం నేను సాధించానని నలుగురు చెప్పుకోగా విన్నగర్వం రెండునెలలైనా నన్ను యింకా విడచిపెట్టలేదు. పాటిల్ జీవిత ఘట్టాలు. అతనిభార్య ముసుగుచాటు నించి క్రీగంటితో ప్రకటించిన కాంక్ష చూపులు యింకా అప్పుడప్పుడూ నా మనసులో కదులుతున్నాయ్.

ఒకనాటి రాత్రి - అర్ధరాత్రి నా యింటి అంగటితలుపు దడదడ శబ్దం చేసింది. వులిక్కిపడి లేచి - "ఎవరు" అని అరచాను.

"నేను - సాయబా," అన్నాడు.

ఇంతరాత్రిమీద యెందు కొచ్చాడోనని తలుపు తీసి వరండాలో దీపం వెలిగించాను అలసటతో నిట్టూర్పులుతీస్తూ, కమీజంతా రక్తంమరకలతో, నిల్చున్న పాటిల్‌ని చూసి." ఏం చేశావ్ ?"

వాడు రక్తంతో నిండిన బాకు కమీజు నించి తీసి నా వేపు చూపిస్తూ — "నేను పశువుగా వుండేవాడ్ని నీ దయతో మనిషయ్యాను. నా జీతం, నా ప్రేమ, నా బ్రతుకంతా దానికివ్వటం మొదలుపెట్టినా ఆవిడ పరాయివాళ్ళతో పోవటం మానలేదు. మనిషి నయ్యాను - అందుకే అవినీతికి నెట్టుకున్నాను. దానిని పొడిచేశాను సాయబా - పొడిచేశాను." అంటూ నా కాళ్ళమీద పడిపోయాడు.